జాతీయ స్థాయికి కెజిబివి విద్యార్థిని ఎంపిక

విద్యార్థిని తనుజ

ప్రజాశక్తి - గోపవరం : కడప జిల్లా అట్లూరు మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థిని తనుజ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. నంద్యాల జిల్లా అహోబిలంలో నిర్వహించిన అండర్-17 ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా జట్టు తరఫున పాల్గొన్న తనుజ ప్రతిభ కనబర్చి జిల్లాకు రెండోస్థానం సాధించింది. రాష్ట్రస్థాయిలో మెరుగైన ప్రదర్శనను గుర్తించిన కమిటీ ఆమెను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసింది. జనవరిలో ఢిల్లీలో నిర్వహించే పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఫణిశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రమీల తనుజను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..
కడప బాలోత్సవం

వివిధ పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులు
కడప ఉమ్మడి జిల్లా నుంచి మొదటి రోజు 7 వేల మంది హాజరు
ఆకట్టుకున్న సాంస్కృతిక, క్రీడా పోటీలు
విజేతలకు ప్రముఖులచే బహుమతులు ప్రదానం

హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

నృత్య పోటీల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో కడప బాలోత్సవం 3.0 ఉత్సాహంగా, ఉల్లాసంగా ప్రారంభమైంది. బాలల పండుగకు మరియాపురం బాలికల పాఠశాలలోని సివి రామన్ విజ్ఞాన ప్రాంగణం వేదికైంది. వేలాదిమంది విద్యార్థులు కార్యక్రమాన్ని ఉత్సాహంగా హాజరయ్యారు. ముఖ్యంగా ఉమ్మడి కడప జిల్లాల నుంచి వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దాదాపు 14 వేల మంది రెండు రోజులు పాటు నిర్వహించే ఈ బాలోత్సవంలో భాగస్వాములు కానున్నారు. వీరందరూ వివిధ విజ్ఞాన, నృత్య, క్రీడా పోటీల్లో ఎంతో ఆసక్తితో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించుకున్నారు. వీరి ప్రదర్శన కోసం ప్రాంగణలో ప్రత్యేకంగా నాలుగు స్టేజీలను ఏర్పాటుచేశారు. జానపనృత్యం, బృంద గాన పోటీలు, దేశభక్తి పాటల పోటీలు, మట్టి బొమ్మల తయారీల పోటీలు, ఇంకా జూనియర్, సీనియర్లకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, కథారచన మొదలైన అంశాలపై పోటీలు కూడా సమాంతరంగా నిర్వహించారు. బాలోత్సవం పండగ పిల్లలో ఉన్న సృజనాత్మక శక్తిని, భావ వికాసాన్ని పెంపొందించడానికి తోడ్పడిందని చెప్పవచ్చు. కార్యక్రమం ముచ్చటగా మూడోసారి నిర్వహిస్తున్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం దాదాపు 500 మంది వాలంటీర్లు పనిచేస్తున్నారు. చాలామంది టీచర్లు, రిటైర్ అయిన ఉద్యోగులు, ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థులు, ఇతర సామాజిక కార్యకర్తలు చాలామంది ఇందులో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం, మున్సిపల్ సేవల యంత్రాంగం తోడ్పాటును అందిస్తున్నారు.

ఈ సందర్భంగా బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ బాలోత్సవం అందరి తోడ్పాటుతో నడుస్తుందన్నారు. ఇందులో వివిధ పాఠశాలలు, కళాశాలలో హార్దికంగా, ఆర్థికంగా చేయూతనిస్తున్నాయని తెలిపారు. చాలామంది డాక్టర్లు, ఇంజినీర్లు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమానికి అండదండగా నిలుస్తున్నారని చెప్పారు. ఇందులో అన్నమయ్య కళావేదిక, కవయిత్రి మొల్ల కళావేదిక, వేమన కళావేదిక, బ్రౌన్ శాస్త్రి, డాక్టర్ మంజూమియా కళావేదిక ఇలా నాలుగు వేదికలలో వివిధ కళారూపాలను బాలలు ప్రదర్శిస్తున్నారన్నారు. సైన్స్ ప్రయోగాల పోటీలు ఉన్నాయని తెలిపారు.

బాలోత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు నాగముని రెడ్డి మాట్లాడుతూ పిల్లల పండుగకు చాలామంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని జయప్రదం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది రెండు రోజులు పాటు నిర్వహించే బాలోత్సవంలో మొదటి రోజే దాదాపు 7 వేల మంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారని చెప్పారు. వారికి భోజన సదుపాయాన్ని కమిటీ అందజేస్తుందని తెలిపారు .

బాలోత్సవం కమిటీ అధ్యక్షులు గుర్రాల గోపాల్ మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎలాంటి ఎంట్రీ ఫీజు పెట్టలేదన్నారు. విద్యార్థులలో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయడమే ప్రధాన లక్ష్యం, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులందరికీ భాగస్వామ్యం కల్పించామని చెప్పారు. సాంస్కృతిక రంగంలో ఖవ్వాలి, ఉర్దూ విద్యార్థులకు ఉర్దూ భాషలోనే పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఇంగ్లీషు భాషలోనే పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మట్టి బొమ్మల తయారీ పోటీలు, ఏకపాత్రాభినయం, పాటల పోటీలు, ఖతా రచన పోటీలు, కథలు చెప్పే పోటీలు, ఇలా రకరకాల అంశాలలో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తున్నామని అన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, సమాజ సేవకులు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి అందజేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇలాంటి పిల్లల పండుగకు తమ సహాయ సహకారాలను అందజేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇలాంటి వంతు తోడ్పాటును అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు మహేష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ తవ్వా సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, సమతా విభాగం కన్వీనర్ సునీత, బుద్ధిష్ట్ కల్చరల్ సొసైటీ అధ్యక్షులు పిళ్లె కుమారస్వామి రెడ్డి,యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, యోగి వేమన ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మల్లికార్జున రావు, యూనివర్సిటీ విద్యార్థులు, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులు, ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థులు, వాలంటీర్లుగా స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి హాజరై బహుమతుల ప్రదానం చేశారు.

కోలాటం ఆడుతున్న చిన్నారులు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

పిల్లలు ఉదయిస్తున్న సూర్యులు

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, పరిసరాలను పరిశీలిస్తూ, ప్రకృతిని ఆస్వాదిస్తూ ఎదగడం ద్వారా సృజనాత్మకత, శాస్త్రీయ సమాజం పట్ల బాధ్యత ఏర్పడతాయని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో మరియాపురంలో నిర్వహించిన కడప జిల్లా మూడవ బాలోత్సవానికి విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించింది. బాలోత్సవ సభలో ఎన్..వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలంటూ ఎవరూ ఉండరని, పిల్లలు సమాజంలో భాగంగా ఉంటారని, సమాజంలో ఉన్న అవలక్షణాలను చూసే తప్పులు చేయడం అలవాటు పడతారని తెలిపారు. ర్యాంకులు, పోటీతత్వం కాకుండా సృజనాత్మకతను పెంచి వారి ఇష్టా ఇష్టాలు కనుగుణంగా చదువుకునే అవకాశాన్ని పెద్దలు కల్పించాలని కోరారు. కడప బాలోత్సవాల నిర్వహణలో బాలోత్సవ కమిటీకి యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ అభినందనలు తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి

- టన్ను రూ.15 వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

నష్టపోయిన అరటి తోటను పరిశీలిస్తున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, గూడుగుండ్లవారిపల్లెలో అరటి తోటలో మాగిపోయి నష్టపోయిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తుపాన్ కారణంగా నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని ఆయన తెలిపారు. దాదాపు మూడు నెలల నుండి అరటి పంట అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు దారులు రాకపోవడంతో గెలలను తోటలకే వదిలేయడంతో మాగిపోయాయయని వాపోయారు. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంలో ఘోరంగా విఫలం చెందిందని ఆయన విమర్శించారు. అరటి రైతులకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. తక్షణమే జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరటి రైతులకు భరోసా ఇచ్చే విధంగా కృషి చేయాలని ఆయన తెలిపారు. రైతులు అరటి పంట సాగు చేయాలంటే ఒక ఎకరానికి దాదాపు రూ. 1,20,000, నుండి రూ. 1,50,000 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని చెప్పారు. అరటికాయల ధర టన్ను రూ.22 వేల నుంచి రూ.2 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చాలా చోట్ల వేసిన పంటను రైతులు అరటి గెలలతో దున్నివేస్తున్నారని, మూడు నెలల నుంచి అరటి రైతు కన్నీటి కష్టాలే కనపడుతున్నా మార్కెటింగ్ శాఖ ఉద్యానవన శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని వాపోయారు. అరటి ఎగుమతులు కోసం ఇతర దేశాలతో కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోతున్న అరటి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కనీస మద్దతు ధర టన్ను రూ.15000 ప్రకటించి రైతులను ఆదుకునే దిశగా చూడాలని ఉద్యాన శాఖ మార్కెటింగ్ శాఖ సబ్సిడీలు కూడా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, నాగిరెడ్డి పల్లె అరటి రైతులు సదానందరెడ్డి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

దిత్వా తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

దిత్వా తుపాన్ ప్రభావం జిల్లాపై ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. దిత్వా తుపాన్ పరిస్థితులను ఎదుర్కొనే చర్యలు, సంసిద్ధతపై కలెక్టర్ శ్రీధర్ జిల్లా స్థాయి అధికారులతో శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టం చోటు చేసుకోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై తగు సూచనలు చేశారు. ఎలాంటి పరిణామాలనైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాయంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తగా అధికారులు మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ గట్ల పరిరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు సంబంధిత సిబ్బందితో 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పోలీసు, అగ్నిమాపక సిబ్బందితో పాటు రెస్క్యూ టీమ్ ను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పిహెచ్‌సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని సూచించారు.రెవెన్యూ డివిజన్ కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను డిసెంబర్ 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె. కల్పన, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకో వడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించు కోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ, థైరాయిడ్, పిసిఒడి వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు యోగా సాధన చేయిస్తామని పేర్కొన్నారు. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238 986లలో సంప్రదించాలన్నారు.

కళాకారుడిని హతమార్చిన వారిని
కఠినంగా శిక్షించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

నెల్లూరు జిల్లాలో డివైఎఫ్ఐ నాయకుడిని హతమార్చిన గంజాయి ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. నెల్లూరులో డివైఎఫ్ఐ నాయకులు,ప్రజా కళాకారుడు పెంచలయ్యను హతమార్చిన ఘటనను నిరసిస్తూ కడపలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నెల్లూరులో డివైఎఫ్ఐ నాయకులు పెంచలయ్య నివాసం ఉండే ప్రాంతంలో యువకులను మత్తు పదార్థాలకు బానిసలుగా కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముఠాను అడ్డుకునేందుకు వారిపై పోలీసులకు పిర్యాదు చేశారని, గంజాయి ముఠాపై పోరాటం చేశాడని తెలిపారు. దీనిని మనసులో పెట్టుకుని కక్షపూరితంగా గంజాయి ముఠా ఓర్వలేనితనంతో పెంచలయ్యను కాపు కాచి హత్య చేశారని తెలిపారు. డ్రగ్స్ గంజాయి పైన డివైఎఫ్ఐ పోరాటం కొనసాగుతుందని దాడులకు భయపడేది లేదని భవిష్యత్తులో వీటిపైన మరింత తీవ్రస్థాయిలో పోరాటాలు సాగిస్తామని తెలిపారు. వెంటనే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు పెద్దన్న, నాయకులు నిర్మల్, రాజు, తేజ, సంతోష్ పాల్గొన్నారు.

బద్వేలు : యువత గంజాయి, డ్రగ్‌కు బానిసలు కావద్దని, చెడు వ్యసనాలకు గురై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని తన ఆటపాటలతో యువతను చైతన్యం చేస్తున్న డివైఎఫ్ఐ నెల్లూరు నగర నాయకులు పెంచలయ్యను హత్య చేసి కిరాతకంగా చంపిన కిరాయి గుండాలను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్‌స్టాండ్ వద్దనున్న భగత్ సింగ్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, ఎస్.కె. ఆదిల్ రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి బద్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు యువరాజు, నాగేంద్ర సహాయ కార్యదర్శులు సుధాకర్, దళిత నాయకులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ - 14 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు 235 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా 19 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 82.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. ఆ జట్టులోని పివిఎస్ ఆర్ వర్మ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 187 బంతులను ఎదుర్కొని 23 బౌండరీలు, ఒక సిక్సర్ సహాయంతో 193 పరుగులు (సెంచరీ) చేశాడు. తులసి రామ్ 59 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టులలోని యాదేశ్ రెండు, జై వర్ధన్ నాథ్ రెండు వికెట్లు తీసుకున్నారు. కెఎస్ఆర్ఎమ్ క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్, నార్త్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 206 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 12 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నార్త్ జోన్ విన్నర్స్ జట్టు 90.0 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. ఆ జట్టులోని కెపి శ్రీరామ్ 105 పరుగులు (సెంచరీ) చేసి నాట్ అవుట్ గా నిలిచాడు. సాయి అర్జున్ 53, రేయాన్స్ సాయి 44 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని శ్రీ చరణ్ అలవల రెండు, రోహిత్ రెండు వికెట్లు తీసుకున్నారు. బ్యాచ్ డ్రాగాముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో నార్త్ జోన్ విన్నర్స్ జట్టు ఆధిక్యత సాధించింది.

సాయిబాబా స్కూల్లో వింటర్, స్నో డే

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని అక్కాయపల్లెలో ఉన్న సాయిబాబా హైస్కూల్లో వింటర్ డే, స్నో డే కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. 46వ డివిజన్ కార్పొరేటర్, సిఇఒ ఎం.వి.శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వింటర్, స్నో డే థీముపై తయారుచేసిన ఆర్ట్స్, క్రాఫ్ట్స్, మోడల్స్ అద్భుతంగా ప్రదర్శించారని పేర్కొన్నారు. చలికాలంలో విద్యార్థులు తీసుకోవాలసిన ఆరోగ్య జాగ్రత్తలు, అలవాట్లు గురించి సూచించారు. చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరాన్ని నివారించడానికి వేడి బట్టలు ధరించాలని తెలిపారు. వేడి ఆహారం ఎంత ముఖ్యమో వివరించారు. చలికాలంలో కూడా తగిన నీరు తీసుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలోవైస్ చైర్మన్ ఎం.వి. సాయి సుధీర్ కుమార్ రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

చిన్నారులతో పాఠశాల వైస్ చైర్మన్ ఎం.వి.సుధీకర్‌కుమార్‌రెడ్డి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్

ఆర్థిక అక్షరాస్యత పెంపునకు వెబినార్

ప్రజాశక్తి - కడప : విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు వెబినార్ ఎంతో ఉపయుక్తమవుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాల వాణిజ్య విభాగం నిర్వహించనున్న 'జాతీయ వెబినార్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఏ లైఫ్ స్కిల్ అండర్ ఎన్.ఈ.పి 2020' కరపత్రాన్ని శనివారం ప్రిన్సిపల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడులు, పొదుపులు, మ్యూచువల్ ఫండ్స్ వంటి ఆర్థిక విషయాలపై అవగాహన అందించే లక్ష్యం తో కార్యక్రమం రూపొందించారని పేర్కొన్నారు. డిసెంబర్ 2న ఉదయం 10:30 గంటల నుంచి నిర్వహించే వెబినార్‌కు జాతీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం సహకరించనుందని కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ ఎ. నాగరాజు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్, ఐక్యూఎసి కో- ఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి. సురేష్‌బాబు, డాక్టర్ జి. వెంకట సుబ్బయ్య, టి. మధుసుదన, డాక్టర్ ఆర్. నీలయ్య, పరీక్షల నియంత్రణాధికారి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, శివరాం పాల్గొన్నారు.

కెఎస్‌ఆర్‌ఎం అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

హిందూస్తాన్ విశ్వ విద్యాలయం, చెన్నై కంప్యూటర్ సైన్స్ విభాగంలో కెఎస్‌ఆర్‌ఎం కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.ప్రియాంకకు డాక్టరేట్ ప్రదానం చేశారు. 'ఆప్టిమైజ్ వెహికిల్ డిటెక్షన్ ఎన్ డైనమిక్ ట్రాఫిక్ ఎన్విరాన్మెంట్ యూజింగ్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ అప్రోచ్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.గోపాల కృష్ణన్, హిందూస్తాన్ విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో ఈ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ కెఎస్ఆర్ఎం కళాశాల సిఎస్ విభాగం ప్రొఫెసర్ వి.లోకేశ్వర్ రెడ్డి, గైడెన్స్‌తో ఈ పరిశోధన త్వరితగతిన పూర్తి అయ్యిందని పేర్కొన్నారు. తాను డాక్టరేట్ పొందడానికి సహకరిఒచిన తల్లితండ్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రొఫెసర్లు, గైడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధిలో యుటిఎఫ్ పాత్ర కీలకం : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్



'పది' మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ, యుటిఎఫ్ నాయకులు

విద్యాభివృద్ధిలో యుటిఎఫ్ పాత్ర కీలకమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్. శంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం కడపలోని డిఇఒకార్యాలయంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన పదవ తరగతి మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా ప్రభుత్వ విద్యా రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు నిరంతరం పాటు పడుతుందని తెలిపారు. హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించిన సంఘంగా యుటిఎఫ్ రాణిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించడం ఒక్క యుటిఎఫ్‌కు మాత్రమే సాధ్యమన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీంరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే ప్రతి ఏడాది నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులచే మోడల్ ప్రశ్నాపత్రాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మోడల్ పేపర్స్ కావలసినవారు 9492805708, 9848021290 నంబర్లతో పాటు ఆయా ప్రాంతా లలోని యుటిఎఫ్ నాయకత్వాన్ని సంప్రదిం చాల న్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపీ నాథ్, బి.చంద్రశేఖర్, చిట్వేలు మండల విద్యాశాఖ అధికారులు షేక్ ఖాజా మొహియిద్దీన్, ఎం.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కలసపాడు : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే విజ యమ్మ, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చెన్నుపల్లెలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి ఎకరాకూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు అధిక ప్రాధాన్యతన ఇతర సాగు విధానంపై ప్రభుత్వం కల్పించే పథకాల గురించి వారు వివరించారు. బద్వేలు, పోరుమామిళ్లలో మార్కెట్ యార్డులను త్వరలో పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సాధనకారి రంతూ, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి ఉపాధ్యక్షుడు పట్టాభి రెడి, . నీటి సంఘం అధ్యక్షులు కొత్తపల్లె చిన్న రంగారెడ్డి అన్నారెడ్డి శ్రీనివాసుల రెడ్డి యువ నాయకులు మామిళ్ల పల్లె మన్యం మల్లికార్జునరెడ్డి, కొత్తపల్లె స్వామి రంగారెడ్డి, శ్రావణ్ కుమార్‌రెడ్డి, పెద్దిరెడ్డి, రామకృష్ణారెడ్డి , రైతులు పాల్గొన్నారు

రైతన్న మీకోసం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు

తెలుగుభాషపై చిన్నచూపు తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నూతన విద్యా విధానంలో దేశ మంతటా మాతృభాషలకు ప్రాధా న్యత ఇస్తూ ఉంటే ఎపిలో మాత్రం తెలుగు భాషను చిన్నచూపు చూ స్తున్నారని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్. సంగమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎస్‌టియు కార్యాలయంలో కార్యకర్తల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి ఫిన్లాండ్ విధా నాన్ని అమలు చేస్తానంటూ పైకి గొప్పలు చెబుతూ ఎన్నికల హామీ ల్లో భాగంగా తెలుగు మీడి యాన్ని పునరుద్ధరించకుండా ప్రాథమికోన్నత పాఠశాలలలో ఉన్న తెలుగు పోస్టును కూడా తీసేశారన్నారు. పైకి మాత్రం ప్రపంచ స్థాయిలో ఎపి విద్యా విధా నాన్ని నిలబెట్టడానికి అహర్నిశలు శ్రమిస్తున్నానని గొప్పలు చెబుతున్నారన్నారు.

విపరీతం!

ప్రజాదృష్టి

జిల్లాలోని ఇటీవలి పరిణామాలను నిశితంగా గమనిస్తే విస్తుపోవాల్సి వస్తోంది. ప్రొద్దుటూరు పోలీస్ అధికారులు ఓ బంగారు వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఉదంతం దగ్గర నుంచి పులివెందుల మెడికల్ కళాశాల స్థలాన్ని రూ.100లకే ఎకరం కేటాయిస్తుండడం వంటివి చోటుచేసుకున్నాయి. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఓ బంగారు వ్యాపారిని రెండేళ్ల కిందటి కేసులో భార్య సమక్షంలో ఇద్దరు సిఐ స్థాయి అధికారులు పట్టణ నడిబొడ్డున కిడ్నాప్ చేయడం దుమారం రేపింది. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు సంబంధిత సిఐని జిల్లా కేంద్రానికి రిపోర్టు చేసుకోవాలని ఆదేశించడం, మరో సిఐ ఎవరో తెలియకపోవడం, వీరి వెనుక ఎవరు ఉన్నారో కోణంపై తదుపరి దర్యాప్తు కొనసాగిస్తామనడం వరకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఓ ఉత్తరాధి రాష్ట్రంలో పోలీస్ డిపార్టుమెంట్‌కు చెందిన ఓ మహిళా ఉద్యోగిని వేధించిన కేసులో సిఐ స్థాయి అధికారిని సాధారణ కానిస్టేబుల్ పోస్టుకు డిమోట్ చేసిన తరహాలో కఠిన చర్యలు తీసుకోవడాన్ని పరిశీలించాలి. అప్పుడే ఇటువంటి బరితెగింపు చేష్టలకు అడ్డుకట్ట పడుతుందేమో చూడాలి. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రి మండలి పులివెందుల మెడికల్ కళాశాలకు చెందిన ఎకరా స్థలాన్ని రూ.100 విక్రయిస్తామనడం హాస్యాస్పదం. రూ.100 కూడా వెచ్చించలేని నిరుపేద కార్పొరేట్ సంస్థకు 30 ఏళ్ల పాటు మెడికల్ కళాశాల, ఆస్పత్రిని నిర్వహించే సామర్థ్యం ఎక్కడ నుంచి వస్తుందో సదరు కేబినెట్ సెలవివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి చౌకబారు పాలసీల అమలు ద్వారా కార్పొరేట్లను సైతం చిన్న బుచ్చుతున్నట్లు కనిపిస్తోంది. పరిశ్రమల ఏర్పాటు చేయడానికి రహదారులు, తాగునీరు, విద్యుత్, భూ కేటాయింపులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని వాదించడం వరకు బాగానే ఉంది. రూ.100లకు ఎకరా స్థలాన్ని విక్రయించాలనే ధోరణి మరీ విడ్డూరంగా ఉందని, సాధారణ ప్రజలు సైతం నవ్వుకుంటారనే శంక కూడా లేకపోవడం చూపరులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. మొంథా తుపాన్ బాధిత రైతులను ఆదుకున్నామనే పేరుతో పాలకులు ఊదరగొట్టిన సంగతి తెలిసిందే. వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ మొంథా తుపాన్ బాధితుల పొలాల్లో పర్యటించి, నష్టపోయిన రైతులకు పరిహాసం ఇత్యాది విషయాల్లో భరోసా కల్పించే ప్రయత్నం చేయడం గమనార్హం. రాష్ట్రంలోని కూటమి సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ నష్టపోయిన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవ్వరూ భయపడొద్దని, న్యాయం జరగకపోతే న్యాయపోరాటం చేస్తామని ఊరడించడం రైతులదృష్టినీ ఆకర్షించింది. రాష్ట్రంలోని కూటమి సర్కారు తలపెట్టిన రైతన్నా.. మీకోసం కార్యక్రమ నిర్వహణలో రాష్ట్రంలోనే కడప జిల్లా మెరుగైన స్థానాల్లో నిలిచిందనే వార్త ప్రసార సాధనాల్లో ప్రముఖంగా కనిపించడం వ్యూహాత్మకంగా ప్రచారంలో ఉంచారా అనే సందేహాలు వ్యక్తమవుతుండడం గమనార్హం.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మాట్లాడుతున్న కెసి కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి

రెండవ పంటకు నీటి విడుదలపై 10లోపు నిర్ణయం

ప్రజాశక్తి - చాపాడు

కెసి కెనాల్‌కు ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నీటిని విడుదల చేశామని, రెండవ పంటకు సంబంధించి నీటి విడుదలపై డిసెంబర్ 10లోగా స్పష్టమైన ప్రకటన చేస్తామని కెసి కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసిన రైతులు నూర్పిడి పనులు మొదలు పెట్టారన్నారు. రెండవ దఫా వరి పంట సాగుకు ఎలాంటి పరిస్థితులలో తొందరపడి వరి నార్లు పోయవద్దని సూచించారు. డిసెంబర్ 10లోగా నంద్యాలలో కెసి కెనాల్ నీటి విడుదలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఉంటుందన్నారు. అక్కడ చర్చించి నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఇప్పటికే ప్రభుత్వానికి నీటి విడుదలపై చర్చలు జరపారన్నారు. రెండవ కారుకు నీటి విడుదలపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారని, నిర్ణయం ప్రకటించే వరకు వేచి ఉండాలన్నారు. రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, నీటిపారుదల సంస్థ రాష్ట్ర డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం సొసైటీ చైర్మన్ మార్తల నరసింహారెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు సుదర్శన్ యాదవ్, గోసుల వీరారెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్లు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత రాత్రి 8:30 వరకు, ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను మానసిక వేదనకు గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కోచింగ్ సెంటర్ల అనుమతికి ప్రభుత్వం నిబంధనలు విధించినా ఎక్కడా వాటిని పాటించట్లేదు. ఆరో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఐఐటి అంటూ అనేక పేర్లతో విద్యార్థులను వారి తలిదండ్రులను మభ్యపెడుతూ ఆదాయం అర్జిస్తున్నారు. ఇరుకైన గదులలో కనీస సదుపాయాలు లేని భవనాలలో తరగతులను నిర్వహిస్తున్నారు. లైసెన్సు, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి, పోలీసు శాఖ నుంచి ఎన్ఓసి, భవన వినియోగ ధ్రువీకరణ పత్రం, విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు వంటి ప్రత్యేక ఏర్పాట్లు ఎక్కడా లేవు. విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని విద్యావేత్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీటిపైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైజిఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

- కర్ణాటక రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విద్య, ఉపాధి కల్పనలో వైజిఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని కర్ణాటక రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. శనివారం బెంగళూరులో కన్నడ రజతోత్సవ సంబరాలు-2025 శ్రీఆదిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 51 మందికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకుగానూ ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో మండలంలోని నంద్యాలంపల్లికి చెందిన వైజిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్ర నాగు శ్రీధర్‌రెడ్డి విద్య, ఉపాధి రంగంలో అందించిన సేవలకు సత్కరించారు. ఈ సందర్భంగా కర్ణాటక మంత్రి మాట్లాడుతూ విద్య, ఉపాధి కల్పనలో శ్రీధర్‌రెడ్డి ఎంతో అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేసే నాయకులు ఎంత అరుదో అందరికీ తెలిసిన విషయమే అన్నారు. శ్రీఆదిత్య ఫౌండేషన్ చైర్మన్ సునీతరెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదు.. మన ప్రాంతం సామాజికంగా, సాంస్కృతికంగా ఎదగడంలో శ్రీధర్ రెడ్డి పాత్ర ఎంత ముఖ్యమో తెలియజేసే ప్రతిష్టాత్మక గౌరవం అని ఆమె కొనియాడారు. అవార్డు గ్రహీత శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడంతో తన బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. భవిష్యత్తులో మరింత స్థాయిలో సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల అభ్యున్నతే ట్రస్టు లక్ష్యమన్నారు.

సన్మాన కార్యక్రమంలో వైజిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

మండల స్థాయి క్రికెట్ జట్టు ఎంపికలు పూర్తి

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న టీచర్స్ టోర్నమెంట్-2025లో భాగంగా లక్ష్మీపేట హైస్కూల్‌లో ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు ఎంపికలు జరిగాయి. మొత్తం 16మందిని చాపాడు మండల క్రికెట్ జట్టుగా ఎంపిక చేసినట్లు ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. స్టాండ్ బైగా నలుగురిని ఎంపిక చేశామన్నారు. బ్యాట్స్‌మెన్స్, బౌలర్స్, అల్రౌండర్స్ ఉండేలా ఎంపిక జరిగిందన్నారు. ఈ పోటీల్లో ఉపాధ్యాయులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయలకు క్రీడలు నిర్వహించడం వల్ల క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. క్రికెట్ జట్టు ఎంపికకు ప్రొద్దుటూరు క్రికెట్ అకాడమీ కోచ్ నరేష్‌రెడ్డి పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వంశీకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్లు శివారెడ్డి, ఓబయ్య, ఓబులేసు, రాజేశ్వరి, వినోలియా రాణి, కృష్ణవేణి, లక్ష్మీపేట హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాల : క్రీడలతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. లింగాల జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో శనివారం ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు, మహిళ ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు డిసెంబర్ 13,14 తేదీల్లో పులివెందులలో నిర్వహించే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఇఒలు విశ్వనాథరెడ్డి, రామకృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో క్రీడల కో-ఆర్డినేటర్ విక్టర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

గిట్టుబాటు ధరకు ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ దేవి పద్మలత కోరారు. అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంక్ ఆవరణలో శనివారం కొనుగోలుకు సంబంధించిన విధి విధానాలను తెలియజేసే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాపాడు మండల పరిధిలో 15వేల ఎకరాల్లో వరి సాగైందన్నారు. ప్రస్తుతం పంటను నూర్పిడి చేసేందుకు సిద్ధపడుతున్నారన్నారు. డిసిఎంఎస్ ఆధ్వర్యంలో చాపాడు, అన్నవరం గ్రామాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఏ గ్రేడు రకం క్వింటా రూ.2,389, బి గ్రేడ్ క్వింటా రూ.2,369 కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం సేకరించిన 24 నుంచి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. దళారుల మాటలు నమ్మవద్దని, రైతులు గిట్టుబాటు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం చైర్మన్ మార్తల నరసింహారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, నీటి పారుదల సంస్థ రాష్ట్ర డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి, సొసైటీ డైరక్టర్లు సుదర్శన్, వీరారెడ్డి, సొసైటీ సీఈవో జాన్, డీసీఎంఎస్ సూపర్వైజర్ తిరుపాల్‌రెడ్డి, టిడిపి నాయకులు వీర శేఖర్‌రెడ్డి, రజనీకాంత్, సలీం, వెంకట రమణారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

వేరుకుళ్లు తెగులు ఉధృతి నివారణకు చర్యలు చేపట్టాలి

పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - ముద్దనూరు

శనగ పంటలో వేరుకుళ్లు తెగులు ఉధృతి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు డాక్టర్ అంకయ్య కుమార్, సునీల్ సూచించారు. మండంలోని కె.తిమ్మాపురం, కొసినేపల్లె గ్రామాల్లో శనివారం వారు శనగ, కంది పంటలను పరిశీలించారు. స్థానిక ఎడిఎ రామ్మోహన్‌రెడ్డి, ఎఒ వెంకట కృష్ణారెడ్డితో కలిసి శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనగ పంటలో వేరుకుళ్లు తెగులు ఉధృతి నివారణకు కాంటాఫ్ (హెక్సా కొనజోల్)అనే మందును 2 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రబ్బరు పురుగు కనిపిస్తే ఇమామెక్టిన్ బెంజెట్ 80 గ్రాములు ఒక ఎకరానికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కంది పంటలో బ్లాక్ త్రిప్స్, మారుకా మచ్చల పురుగు నివారణకు సైహ నాట్రానిలిప్రోల్ అనే మందు ఎకరానికి 60 ఎంఎల్ లీటరు నీటిలో ఎకరానికి 0.6 ఎంఎల్ చొప్పున 13.0.45 అనే ఎరువును 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే 19.19.19 అనే నీటిలో కరిగే ఎరువును ఒక ఎకరానికి కిలో చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా పిచికారీ చేస్తే వేరుకుళ్లు తెగులు నివారణ నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. ముదురు దశలో ఉండి పూతకు వస్తున్న పంటలో కోరాజిన్ మందు 60 ఎంఎల్ 13.0.45 అనే నీటిలో కరిగే ఎరువును ఒక కిలో చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త యాస్మిన్, డాట్ సెంటర్ కో-ఆర్డి నేటర్ క్రిష్ణప్రియ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామసుధ, రైతులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న శేష మహేశ్వరమ్మ

అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నేషనల్ అవార్డు ఫర్ ఇంజినీరింగ్ కాలేజ్ బెస్ట్ ఉమెన్ టీచర్-2025 అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని జేఎన్టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శేష మహేశ్వరమ్మ తెలిపారు. 55వ ఐఎస్‌టిఇ జాతీయ వార్షిక అధ్యాపక సదస్సులో ముఖ్య అతిథి మాజీ కేంద్రమంత్రి, కమిషనర్ ఆఫ్ పోలీస్, ముంబై డాక్టర్ సత్యపాల్ సింగ్, డాక్టర్ ప్రతాప్ ప్రతాప్సిన్హ కాక సాహెబ్ దేశాయి, ఐఎస్‌టిఇ ప్రెసిడెంట్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమం ఈనెల 29న పుదుచ్చేరి శ్రీమనకుల వినయగార్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయ పరిపాలకులు, వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. విష్ణువర్ధన్, శ్రేయోభిలాషులు, సహోద్యోగులు, విద్యార్థులు, గురువులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించిన విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

గండి పాపాగ్ని నదిలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులు తొలగించారు. శనివారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో గండిలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కోటేశ్వరి తెలిపారు. నదిలో పరిశుభ్రత కార్యక్రమం ఏర్పాటు చేశారు. నది పరిసరాలను విద్యార్థులు శుభ్రపరిచారు. అనంతరం గండి ప్రజలకు విద్య ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సేవా భావం, పర్యావరణ పరిరక్షణ పట్ల చూపిన చైతన్యాన్ని గండి దేవస్థానం అధికారులు ప్రశంసించారు.

ఆర్ఎంపిలపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఆర్ఎంపిల వైద్యంపై తగు చర్యలు తీసుకోవాలని సిఐటియు గౌరవ అధ్యక్షులు ఏసుదాసు కోరారు. ఆ మేరకు శనివారం డిసిహెచ్ఎస్ హిమదేవికి స్థానిక సిఐటియు గౌరవ అధ్యక్షులు గోపాల్ దాస్ ఏసుదాసు, ఆప్కాస్ అవుట్సోర్సింగ్ (సిఐటియు అనుబంధం) గౌరవ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో చాలామంది ఆర్ఎంపిలు డాక్టర్లుగా చెప్పుకుంటూ చిన్నపిల్లలతోసహా ప్రతి ఒక్కరికీ వైద్యం చేస్తున్నారన్నారు. మరికొంతమంది ఇంటిలోనే వైద్యం చేస్తూ అర్హత లేని వారిని నర్సులుగా పెట్టుకుంటూ ఇంజక్షన్లు, సెలైన్ బాటిళ్లు, స్టెరాయిడ్ ఇంజక్షన్లు కూడా వేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు వీరిని తనిఖీ చేయాలని కోరుతున్నామన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

అయ్యప్ప మాలధారుల సౌకర్యార్థం శబరిమలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్బమ్మ తెలిపారు. జమ్మలమడుగు డిపో కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ అయ్యప్ప మాలధారులకు, ప్రజలకు ఎపిఎస్ ఆర్‌టిసి వారు సువర్ణ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఇంద్ర ఏ/సి, అల్ట్రా టెక్, సూపర్ లక్జరి, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. బస్సు బుకింగ్ చేసిన గురు స్వామికి రూ.2000 కమీషన్, ఏడు మంది మాలధారులకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎం సుబ్బమ్మ కోరారు. వివరాలకు 99592 25778ను సంప్రదించాలని ఆమె సూచించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులివ్వని ప్రభుత్వం

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.ఒక్క నిధులు కూడా విడుదల చేయలేదని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శనివారం కమిషనర్ రాముడు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ వైసిపి పాలనలో పులివెందుల మున్సిపాలిటీకి రూ.కోట్ల నిధులు విడుదల చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదని తెలిపారు. సామాన్య ప్రజలపై భారం లేకుండా చూడాలన్నారు. పన్నులను పెంచి ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. మున్సిపాలిటీకి సకాలంలో పన్నులు చెల్లించాలన్నారు. మున్సిపాలిటీ ఆధాయం పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అమాంతంగా ఇంటి పన్నులు 33శాతం జీఎస్టీ తగ్గిస్తామని చెప్పి పెంచితే ఇబ్బందులు పడు తారన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ అధికారులు వార్డుల్లో సమస్యలు ఉంటే ఆ వార్డు లోని కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. యూజీడీ సమస్యలు లేకుండా చూడాలన్నారు. మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. పట్టణంలో మూడు రోడ్లు కమిటీ భవనానికి సంబంధించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో మున్సిపాలిటీకి ఎంపీ నిధుల కింద రెండున్నర కోట్ల రూపాయలు ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని వివరించారు. 1985 నుంచి అనధికార ప్లాట్లను రెగ్యులర్ చేసుకోవాలని చైర్మన్ ప్రజలను కోరారు. గతంలో రెండుసార్లు మున్సిపాలిటీకి అవార్డులు వచ్చాయన్నారు. జగనన్న కాలనీకి సంబంధించి లబ్ధిదా రులు కట్టిన రూ.9.58 కోట్లు మున్సిపల్ అకౌంట్‌లో ఉన్నాయన్నారు. పలు వురు కౌన్సిలర్లు తమ వార్డు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అధికారులు కౌన్సిలర్లకు సహకరించాలని చైర్మన్ వరప్రసాద్ కోరారు. సమావేశంలో ఆర్ఐ ఎజెండా చదివి వినిపించారు. మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస

ప్రొద్దుటూరు : శనివారం సాయంత్రం ప్రారంభమైన మున్సిపల్ సమావేశం ఆది నుంచి రసాభాసగా మొదలైంది. చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి అధ్యక్షతన మొదలైన మున్సిపల్ సమావేశం అర్థాంతరంగా ముగిసింది. చైర్మన్ సీసీ ఓబులేసు తనకు తెలియకుండా కౌన్సిల్ అజెండాను రూపొందించడం ఏంటని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. ఇతనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఆర్‌డికి కమిషనర్ ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ అజెండాలోని 22 అంశాల్లో రెండు అంశాలను తిరస్కరించి, 20 అంశాలను ఆమోదించామని చైర్మన్ లక్ష్మీదేవి తెలిపారు. సీసీని ఎందుకు మార్చావని ప్రశ్నించగా సిసి తన కింది సిబ్బంది అని పరిపాలనా సౌలభ్యం కోసం మార్చానని కమిషనర్ తెలిపారు. దీంతో సమావేశంలో రసాభాస చోటుచేసుకుంది. అర్థాంతరంగా కమిషనర్, సిబ్బంది వెళ్లిపోయారు. ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి హాజరయ్యారు. రసాభాసా చోటు చేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పారు. కమిషనర్ తీరు బాధ్యతాయుతంగా లేదని ఇరువురు వైస్ చైర్మన్‌లతోపాటు వైసిపికి చెందిన కౌన్సిల్ సభ్యులు నినాదాలు చేశారు.

సమావేశంలో ఎంపిపి రమాదేవి, అధికారులు

మందుల కొరతతో అవస్థలు : ఎంపిపి

ప్రజాశక్తి - లింగాల

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రిలో మందుల కొరత ఉందని ఎంపిపి రమాదేవి తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిహెచ్ఓ రఘునాథ్‌కు సూచించారు. అవసరమైన ముందులను అందుబాటులో ఉంచాలన్నారు. మురారిచింతల పశువైద్య అధికారి సుబ్బారాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాడి రైతులకు ప్రోత్సాహం అందించేందుకు రూ.5 లక్షల నుంచి రూ.కోటి వరకు గొర్రెలు, పొట్టేళ్లు, నాటు కోళ్ల వివిధ రకాల పశువులకు రాయితీ ఇస్తోందన్నారు. పాడి రైతులు ప్రోత్సాహకాలు వినియోగించుకోవాలని కోరారు. ఎఒ రమేష్, ఉపాధి ఏపిఒ గంగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ మనోహరరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటరాములు, ఎస్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనార్టీలకు పెద్దపీట

ప్రజాశక్తి - వేంపల్లె

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ పదవుల్లో పులివెందుల నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట వేస్తామని పులివెందుల జనసేన సమన్వయ కర్త డాక్టర్ హరీష్ పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని కేంద్ర ప్రధాన కార్యాలయంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రాం తాళ్లూరిని కలిశారు. పార్టీ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందులలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు జనసేన అధిష్టానం సమ్మతించినట్లు చెప్పారు. మైనార్టీలతోపాటు అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పులివెందుల నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

రాం తాళ్లూరిని కలిసిన జనసేన సమన్వయకర్త హరీష్

నేడు బీటెక్ రవి సమక్షంలో మైనార్టీలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ముస్లిం మైనార్టీలు టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలోఆదివారం టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు. వేంపల్లెకు చెందిన మొండోడు కుటుంబ సభ్యులైన మహమ్మద్ గౌస్ ఆయన సోదరులు, బలిజ సంఘానికి చెందిన కటిక నాగరాజాతోపాటు పలువురు టిడిపిలో చేరనున్నారు. మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో భారీ విందు ఏర్పాటు చేసినట్లు టిడిపి నాయకులు తెలిపారు.

క్రైం కార్నర్

మత్తు ఇంజక్షన్ వేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్నగురువలూరు గ్రామానికి చెందిన కుచ్చుపాప వినోద్ (26) శనివారం మత్తు ఇంజక్షన్ వేసుకొని మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వీరయ్య కుమారుడు వినోద్ కడపలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం అతని తల్లి అనారోగ్యంతో చనిపోయింది. అప్పటినుండి మనోవేదనకు గురై శనివారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఓ మహిళతో ప్రేమలో ఉన్నాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలు మాత్రం ఓ మహిళతో అక్రమ సంబంధం, మరొకరితో ప్రేమలో ఉన్నాడని వీరిద్దరూ వివాహం చేసుకోవాలని బలవంతం చేస్తుండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వినోద్ మృతదేహం (ఇన్‌సెట్), వినోద్ (ఫైల్‌ఫోటో)

స్లీప్‌వెల్ బ్రాండ్ అగర్‌బత్తీలు వాడరాదు

ప్రజాశక్తి - వేముల

వేములలోని పలు సూపర్ మార్కెట్లలో శనివారం వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా దుకాణాల్లో ఆసీస్ కంపెనీ తయారు చేసే స్లీప్ వెల్ అగర్‌బత్తీలు అమ్మకాలు, వాటి నిల్వలు గురించి తనిఖీలు చేశారు. ఈ అగర్‌బత్తీలు లేనట్లుగా నిర్ధారించారు. అనంతరం ఎఒ ఓబులేష్ మాట్లాడుతూ ఆసీస్ కంపెనీ స్లీప్ వెల్ అగర్‌బత్తీలో ప్రాణాంతకమైన మేపర్ ఫ్లూత్రిన్ అనే పురుగు ముందు అవశేషాలు ఉన్నట్లుగా ల్యాబ్ ద్వారా నిర్ధారణ అయిందన్నారు. తద్వారా శ్వాస కోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చివరిగా ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో వ్యసాయం విస్తరణ అధికారి సురేష్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని పలు సూపర్ మార్కెట్లలో పులివెందుల డివిజన్ వ్యవసాయ శాఖ ప్రభాకర్‌రెడ్డి, ఎఒ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆషికాష్ కంపెనీ తయారు చేసే స్లీప్ వెల్ అగర్‌బత్తీల అమ్మకాలు, వాటి నిల్వలు గురించి తనిఖీలు చేశారు. ఇవి విక్రయిస్తే క్రిమి సంహారక చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణాదారులను హెచ్చరించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

చెడు అలవాట్లుతోపాటు సైబర్ నేరాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సిఐ నర్సింహులు సూచించారు. స్థానిక ఉషాకిరణ్ పాఠశాలలో శనివారం ఆయన బాల్య వివాహాలు, శక్తి యాప్, మహిళలపై లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు, డ్రగ్స్, డిజిటల్ అరెస్టు, రోడ్డు భద్రత, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతుంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలికలు, మహిళలు 181, 1091, 1098 నెంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి, పోలీసులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONORABLE VII ADDITIONAL DISTRICT JUDGE : KADAPA

I.A.No. 935/2023

O.S.No. 20/2022

1. K. Sadakh Ali, S/o K.Hafeezullah, Muslim, aged about 37 years, Aadhar No.826081455279, business, residing at D.No.6/382, Jyothi Govindappa Street, Trunk Road, Kadapa City and District and Another. **...Petitioners/Plaintiffs**

Vs

3. Syed Khurshidunnisa Begum, W/o Syed Shaifullah Husseni, Muslim, aged about 63 years, Home Maker, Aadhar number not known, residing at D.No.10/24-31, Khaleel Nagar, Ameen Peer Road, Kadapa City and District.

...Respondents/Defendants 1 to 5

NOTICE

పైన తెలిపిన వాది/పిటిషనర్ పై రాజశ్రీ కోర్టు నందు పై దావాలో చూపబడిన Suit Schedule దాఖల ఆస్థిని Advocate Commisioner ద్వారా కొలతలను కొలిపించుటకు పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. ఆ పిటిషన్‌లో మీరు హాజరగుటకు మరియు ఆక్షేపణలు తెలియజేయుటకు గాను వాయిదా 9.12.2025వ తేదీన ఉన్నది. కావున మీరు మీ వకీలు ద్వారా గాని పై తెలిపిన తేదీన ఉదయం 10.30 గం॥లకు పై రాజశ్రీ కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనియెడల పై తెలిపిన పిటిషన్‌లో రాజశ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By the Order of the Court//

T.MOHAN KRISHNA
DUGGARAJU ARAVINDH
Advocates, KADAPA.
Cell: 9440992631, 9849441077.

IN THE COURT OF THE HONORABLE VII ADDITIONAL DISTRICT JUDGE : KADAPA

I.A.No. 990/2023

O.S.No. 20/2022

1. K. Sadakh Ali, S/o K.Hafeezullah, Muslim, aged about 37 years, Aadhar No.826081455279, business, residing at D.No.6/382, Jyothi Govindappa Street, Trunk Road, Kadapa City and District and Another. **...Petitioners/Plaintiffs**

Vs

3. Syed Khurshidunnisa Begum, W/o Syed Shaifullah Husseni, Muslim, aged about 63 years, Home Maker, Aadhar number not known, residing at D.No.10/24-31, Khaleel Nagar, Ameen Peer Road, Kadapa City and District.

...Respondents/Defendants 1 to 5 & Proposed parties 6 & 7

NOTICE

పైన తెలిపిన వాది/పిటిషనర్ పై రాజశ్రీ కోర్టు నందు రెస్పాండెంట్‌లు అయిన 6 Shaik Sadruddin మరియు 7 Shaik Umar దావాలో చేర్చుటకు గాను పైన తెలిపిన పిటిషన్ దాఖలు చేసియున్నారు. ఆ పిటీషన్‌లో మీరు హాజరు అగుటకు మరియు మీ ఆక్షేపణలు తెలియజేయుటకు గాను వాయిదా 09.12.2025వ తేదీన వున్నది. కావున మీరు పైన తెలిపిన తేదీన ఉదయం 10.30 ని॥ పై రాజశ్రీ కోర్టు నందు మీరు గాని, మీ తరపున వకీలు హాజరై ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో పైన తెలిపిన పిటిషన్‌లో పై రాజశ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By the Order of the Court//

T.MOHAN KRISHNA
DUGGARAJU ARAVINDH
Advocates, KADAPA.
Cell: 9440992631, 9849441077.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT PRODDATUR

E.P.No. 62/2023 in

O.S.No. 211/2021

Jinka Venkata Subbaiah, S/o J.Gopal, aged 34 years, Hindu, Business, Resident of bearing D.No.5/1540, Keshava Nagar, Proddatur Town, Kadapa District. **...Plaintiff/D.Hr.**

Vs

Goturu Bala Showry, S/o G.Subbanna, Aged 51 years, Employee in Health Assistant, Community Health Care Centre, Chakrayapeta, P.H.C.Chakrayapeta Town & Mandal, Kadapa Dist. His House bearing, D.No.5/21, Prakash Nagar, Prakashampalli Village, Kopparthi Post, C.K.Dinne, Near Kadapa Town, Kadapa District.

...Defendant/J.Dr.

ప్రతివాది/J.Dr.కు E.P.నోటీసు

పై నెంబరు E.P. 62/2023 దావాలోని వాది/D.Hr. రాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జింకా వెంకట సుబ్బయ్య వేసిన శాలరీ అటాచ్‌మెంటు బాకీని గురించి మీ పైన Rs.1,20,980/- వసూలుకు గాను E.P. దాఖలు చేసి ఉన్నాడు. పై దావా E.P.లో 03.12.2025వ తేదీ పగలు గం॥10.30 ని॥లకు వాయిదా వున్నది. పై తెలిపిన కోర్టుకు మీరు ఖుద్దున గాని, లాయరు ద్వారా గాని హాజరై అభ్యంతరాలు తెలుపుకొనవలెను. అటు లేని పక్షంలో మీరు పరోక్షముగా తీర్మానించబడుదురు.

//By Order of the Court//

M.SURESH BABU, B.A.,LL.B.,
Advocate,
PRODDATUR.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KURNOOL

I.A No. /2025 in I.P. NO. 11 /2024

Mangali Jayanna ... Petitioner

-Vs-

K.Madhu Kiran and 20 others

... Respondents

NOTICE TO RESPONDENTS NO. 16

R16. P. Rama Rajeswari Devi D/o P. Bala Chandra Reddy, R/o H.No.1-6, Thangadi Pally, B.Kodur, Kadapa Dist.

పై తెల్పిన అర్జీదారుడు తనను దివాలాదారునిగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు చేసియున్నాడు. ఇందులో 16వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు నుండి పలుమార్లు నోటీసులు పంపినను మీకు చేరనందున పై కోర్టు వారు ఈ పత్రిక ద్వారా మీకు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున 16వ రెస్పాండెంటు అయిన మీకు ఏమైనా ఆక్షపణ ఉన్న యెడల వాయిదా తేది 05-01-2026 ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున న్యాయవాది ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు అర్జీ నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 05-01-2026

S. Chandra Sekhar,
B.Naga Lakshmi Devi,
Advocates for Petitioner
Kurnool.